సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 14 । మే । 2024



పోలింగ్ అధికారిణికి ఫిట్స్

డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న అదనపు పోలింగ్ అధికారిణికి ఫిట్స్ వచ్చాయి.

- 8లో ▸



మొరాయించిన ఈవీఎంలు

జిల్లాలోని పలు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ కొద్దిసేపు నిలిచిపోయింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.9 /22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుంది. పగటి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

09:00	11:00	01:00	03:00	05:00	మొత్తం
10.09%	28.26%	45.67%	58.70%	67.96%	71.47%

న్యూస్‌రీల్

నిమిషం ఆలస్యం.. అనుమతించని సిబ్బంది



ఎడపల్లి : వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పోలింగ్ సమయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం గంట పొడిగించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేయడానికి అవకాశం ఇచ్చింది. ఎడపల్లి మండలం ఠానా కాలనీలో మహిళా ఓటరు బాలమణి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చింది. సమయం మించి పోవడంతో పోలింగ్ సిబ్బంది ఆమెను కేంద్రంలోనికి అనుమతించలేదు. దీంతో బాలమణి నిరాశగా వెనుదిరిగింది.

స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గ్రామాలకు తరలిన ఈవీఎంలు రాత్రి డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీ కళాశాల స్ట్రాంగ్ రూంకు చేరాయి. పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తీసుకుని వాహనాల్లో సీఎంసీ కళాశాలకు చేరుకున్నారు. అర్బన్, రూరల్ నియోజకవర్గాల వారీగా అధికారులకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని అప్పగించారు. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అంసెబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సెంటర్లలో పోలింగ్ సిబ్బంది అప్పగించారు. వాటిని మంగళవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక వాహనాల్లో పోలీస్ బందోబస్తు నడుమ సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు అధికారులు చేర్చారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

ఈదురు గాలులు.. వర్షం

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టిన అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతోకూడిన వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వెంటనే విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరంగా శ్రమించి పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి ప్రతి ఒక్క ఉద్యోగి విధుల్లో ఉంటూ అహర్నిశలు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేసారని, వారి ఎనలేని కృషిని సీఎండీ వరంగల్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించారన్నారు. అలాగే ప్రతి సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు, ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు 1800 425 0028కు లేదా 1912కు ఫోన్ చేయగలని ఆయన తెలిపారు.

చిన్నయానం ఓటర్ల తరలింపు



డొంకేశ్వర్: మండలంలోని చిన్నయానం గ్రామస్తులకు స్థానికంగా పోలింగ్ కేంద్రం లేకపోవడంతో అధికారులు వారిని గాదేపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 112 పోలింగ్ కేంద్రానికి తరలించారు. చిన్నయానం నుంచి గాదేపల్లికి రెండు కిలో మీటర్ల దూరం ఉండడంతో అధికారులు రెండు వాహనాలను సమకూర్చారు. ఓటు వేసిన తర్వాత ఓటర్లను తిరిగి చిన్నయానం గ్రామంలో దింపారు. అధికారులు తమ సమస్యను గుర్తించి ఇబ్బందులు కలుగకుండా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడంపై ఓటర్లు హర్షం వ్యక్తం చేశారు.

పారిస్ నుంచి వచ్చి..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కంచర్ల రఘుచరణ్ పారిస్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. అతడికి ఇటీవలే ఓటు హక్కు వచ్చింది. దీంతో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఉత్సాహంతో పారిస్‌నుంచి వచ్చాడు. సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నాడు.

బారులుదీరి ఓటేసి..



నగరంలో ఓటు వేసిన యువతి

ప్రశాంతంగా పోలింగ్

- అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం
- నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 71.47శాతం పోలింగ్ నమోదు
- 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన పోలింగ్ శాతం
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



నగరంలోని ఐటీఐ కళాశాల పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన మహిళా ఓటర్లు



ఆర్మూర్‌లో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న కుటుంబ సభ్యుడు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రధాన ఘట్టమైన పోలింగ్ సోమవారం నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడా కొద్దిసేపు ఈవీఎంల మొరాయింపు, నామమాత్ర ఘటనలు మినహా ప్రక్రియ సజావుగా సాగింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 71.47 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల పోలిస్తే మూడు శాతం ఓటింగ్ పెరిగింది.

■ ఇందల్వాయి మండలం సిర్నాపల్లి పంచాయతీ పరిధిలోని రామ్‌సాగర్ తండావాసులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలను బహిష్కరించారు. ఈ గ్రామానికి చెందిన మొత్తం 110 మంది ఓటర్లు తమ గ్రామానికి రోడ్డు వేయలేదని, దీంతో తాము ఓట్లేసేది లేదని భీష్మించారు. కాంగ్రెస్ నాయకులు వచ్చి రోడ్డు నిర్మాణం పై హామీ ఇవ్వడంతో ఓట్లు వేశారు.

■ డొంకేశ్వర్ మండలం సిర్పూర్‌లో 125వ బూత్‌లో వీవీపాట్ మొరాయించడంతో 15 నిమిషాలు ఆలస్యం అయింది. మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో గంట సేపు ఈవీఎం మొరాయించింది. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో 109వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో 40 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లో 93వ బూత్‌లో గంట పాటు ఈవీఎం మొరాయించింది. దీంతో మరో ఈవీఎం తెచ్చి పోలింగ్ కొనసాగించారు. సిరికొండ మండలం చిన్నవాళ్లగూడలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్‌లోని 84వ బూత్‌లో 30 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించింది. జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని వర్ని మండలం తగిలేపల్లిలో 103 బూత్‌లో కొంతసేపు ఈవీఎం మొరాయించింది.

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ..

మోపాల్ మండలం బైరాపూర్‌లో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ, తోపులాట చోటుచేసుకుంది. దీంతో 30 నిమిషాల పాటు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలోని 119వ బూత్‌లో అదనపు పోలింగ్ అధికారిణి సునీతకు ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించారు.



ఓటు వేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



జడ్జి సునీత కుంచాల



సీపీ కల్మేశ్వర్

పోలింగ్ నమోదు ఇలా..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉదయం 9గంటల వరకు 10.9 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటలకు 28.26 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 45.67 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 58.70 శాతం, సాయంత్రం 5 గంటలకు 67.96 శాతం పోలింగ్ నమోదైంది. చివరకు పోలింగ్ ముగిసే సమయానికి 71.47 శాతం నమోదైంది.

■ పోలింగ్ ముగింపు సమయం 6 గంటల కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు వరుస క్రమంలో ఉన్నారు.

■ 2019 పార్లమెంట్ ఎన్నిక ల్లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో 68.37 శాతం పోలింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా ఐదు నెలల క్రితం జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 74.13 శాతం పోలింగ్ నమోదైంది.

■ గత నెల 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే ప్రధాన పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తయింది. 29వ తేదీన ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అప్పటి నుంచి ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు తాము సాధించే ఓట్లపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై జాతీయ పార్టీల అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆశాభావంతో ఉన్నారు.

రాత్రి వరకు పోలింగ్..

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 71.47 శాతం పోలింగ్ నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. తుదిగా ఖరారయ్యే జాబితాల్లో స్వల్ప మార్పులు జరిగేందుకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. పలుచోట్ల రాత్రి వరకు పోలింగ్ కొనసాగిందని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించారు.











ఓటు వేసేందుకు వీల్ చైర్‌పై పోలింగ్ కేంద్రానికి వచ్చిన దివ్యాంగురాలు, వృద్ధురాలు, జగిత్యాలలో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, సిరికొండ మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నగరంలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ శాతం

నియోజకవర్గం	ఓటర్లు	ఉ.9.00	ఉ.11.00	మ.1.00	మ.3.00	సా.5.00
ఆర్మూర్	212145	11.13	28.39	45.5	60.36	69.61
బోధన్	223096	11.04	29.45	47.81	61.48	70.84
ని.అర్బన్	304317	10.35	23.04	38.67	49.57	57.86
ని.రూరల్	256593	11.49	28.77	46.99	61.03	70.54
బాల్కొండ	226792	11.02	30.53	49.04	61.87	71.31
కోరుట్ల	245249	10.75	29.1	47.77	60.44	70.07
జగిత్యాల	236675	10.42	30.1	45.94	58.93	68.55



డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఎన్నికల సామగ్రిని అప్పగిస్తున్న సిబ్బంది

2019 పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వివరాల పట్టిక..

అసెంబ్లీ సెగ్మెంట్	పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
ఆర్మూర్	214	191414	134894	70.47
బోధన్	246	206644	148667	71.94
నిజామాబాద్ అర్బన్	281	268429	151002	56.25
నిజామాబాద్ రూరల్	286	235951	169206	71.71
బాల్కొండ	245	205653	148085	72.01
కోరుట్ల	262	228368	157779	69.09
జగిత్యాల	254	216379	151989	70.24
మొత్తం	1788	1552838	1061622	68.37

పకడ్బందీగా బందోబస్తు

- సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించిన సీపీ
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- భారీగా పోలీసుల మోహరింపు



నగరంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. బోధన్, నందిపేట్ మండలంలోని వెల్మల్‌లో రెండు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు పోలీసుల పహారాలో ఉన్నాయి. సెంటర్ల వద్ద ప్రచారం నిర్వహించకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్దకు వచ్చి ఓటర్లతో మాట్లాడిన వారిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన సీపీ

పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 1,808 పోలింగ్ కేంద్రాలుండగా అందులో 700 వరకు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. నగరంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ కల్మేశ్వర్ పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా జిల్లాలోని సమస్యాత్మక కేంద్రాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

వాహనాల ట్రాఫిక్ మళ్లింపు

పోలింగ్ కేంద్రాల వద్ద రోడ్లపై నుంచి వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. నగరంలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఆర్మూర్, బోధన్‌లోని కేంద్రాల వద్ద రోడ్లను బారీకేడ్లతో మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఓటర్లను వరుస క్రమంలో ఉంచి ఒకరి నుంచి ఐదుగురు మాత్రమే లోపలికి అనుమతి ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా ఉన్న వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు.

మూడు వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు

జిల్లాలో మూడు వేలకు పైగా పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. నలుగురు అదనపు డీసీపీలు, 19 మంది ఏసీపీలు, 38 సీఐలు, 64 మంది ఎస్సైలు, ఇతర సిబ్బంది ఎన్నికల బందోబస్తులో పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ బీజేపీ కార్యకర్త

- బోధన్‌లో చోటుచేసుకున్న ఘటన
- పరామర్శించిన ఎంపీ అర్వింద్
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తీరంటూ విమర్శ



గాయపడిన బీజేపీ కార్యకర్త నందిపేట నవీన్‌ను పరామర్శిస్తున్న ఎంపీ అర్వింద్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని ఉద్మీర్ గల్లీలో గల 69వ పోలింగ్ బూత్ వద్ద కొందరు యువకులు బీజేపీ కార్యకర్త నందిపేట నవీన్‌పై దాడిచేసి గాయపర్చారు. ఉదయం పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వేసేందుకు నవీన్ వెళ్లగా.. అదే సమయంలో మరికొందరు ఓటు వేసేందుకు వచ్చారు. వీరికి కొందరు యువకులు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెబుతుండగా.. వారు ఎవరికైనా ఓటు వేస్తారని, మీరు వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని నవీన్ అనడంతో.. నీకేందుకు అని వాగ్వాదానికి దిగారు. ఈ విషయం గొడవకు దారి తీసింది. ఇద్దరు యువకులు నవీన్‌పై దాడికి దిగారు. ఇటుకతో బీజేపీ కార్యకర్త తలపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయామైంది. అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ శ్రేణులు అక్కడి చేరుకొని నవీన్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీ ధర్మపురి అర్వింద్ బోధన్‌లోని నవీన్ నివాసానికి చేరుకొని పరామర్శించారు. గొడవకు గల కారణం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో మైనారిటీలను నెత్తినెక్కించుకుందని విమర్శించారు. బీజేపీ కార్యకర్త నవీన్‌పై అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై కేసు నమోదైందని.. అలాంటి వారికి ఎలా బుద్ధి చెప్పాలో తమకు తెలుసన్నారు. ఎంపీ వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బాలరాజు, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి తదితరులున్నారు.

డప్పు చప్పుళ్ల మధ్య..

పెద్దకొడప్‌గల్: ప్రజాస్వామ్యంలో ఓట్ల పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఈ పండుగను ప్రత్యేకంగా జరుపుకోవాలనుకున్నాడు కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం వడ్లం గ్రామానికి చెందిన చంద్రయ్య స్వామి. ప్రత్యేకంగా నిలవాలన్న ఆలోచనతో మిట్టమధ్యాహ్నం గొడుగు ధరించి, డప్పు చప్పుళ్ల మధ్య ఇంటినుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఓటు హక్కు వినియోగించుకున్నాడు. భావి తరాల భవిష్యత్‌కోసం ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని కోరాడు.



మాక్లూర్ మండలం మాణిక్‌బండార్ పోలింగ్‌బూత్ వద్ద బారులు తీరిన మహిళలు



నగరంలో ప్రత్యేక బలగాల బందోబస్తు



నిజామాబాద్‌లోని ఎస్‌ఎఫ్‌ఎస్ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో..



పెద్దబజార్‌లోని పోలింగ్ కేంద్రంలో మహిళల క్యూ..



అమెరికా నుంచి వచ్చి ఓటేసిన మంచాల హారిణి



నిజామాబాద్ నగరంలో..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించినప్పటికీ సాంకేతిక సిబ్బంది సమస్యను పరిష్కరించడంతో పోలింగ్ కొనసాగింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిజామాబాద్ నగరంలో ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు

చంటి పిల్లలతో పోలింగ్ కేంద్రాలకు..



బాబుతో వచ్చి రెంజల్‌లో ఓటేసిన యువతి



పిల్లలతో వచ్చి కందకుర్తిలో క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు



జిల్లా కేంద్రంలోని అర్సపల్లి పోలింగ్ కేంద్రంలో..

సాక్షి నెట్‌వర్క్: చంటి బిడ్డలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన మాతృమూర్తులు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు. ఇటీవలే అమెరికా నుంచి వచ్చిన రెంజల్‌కు చెందిన యువతి చంటి పిల్లాడిని ఎత్తుకొని తల్లిదండ్రులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చింది. కందకుర్తి గ్రామంతోపాటు నిజామాబాద్ నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో చంటిపిల్లలను ఎత్తుకొని తల్లులు క్యూలైన్‌లలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నిజామాబాద్ నగరంలో..

మధ్యాహ్నం తరువాత పోలింగ్ ప్రారంభం

- రోడ్డు కోసం రాంసాగర్ తండావాసుల నిరసన
- ఎన్నికలను బహిష్కరిస్తామన్న గిరిజనులు

ఇందల్వాయి(నిజామాబాద్ రూరల్): తమ తండాకు రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సిర్నాపల్లి గ్రామ పరిధిలో ఉన్న రాంసాగర్ తండావాసులు ఎన్నికలను బహిష్కరించారు. సిర్నాపల్లి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న తమ తండాకు రోడ్డు వేసే అంశాన్ని ఏళ్లుగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండాలో 35 కుటుంబాలకు చెందిన170 మంది జనాభా ఉన్నారు. 110 ఓట్లు ఉన్న 177 పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నం వరకు ఒక్క ఓటు కూడా నమోదు కాకపోవడంతో స్పందించిన అధికార కాంగ్రెస్ నాయకుడు మున్సిపల్లి సాయిరెడ్డి తదితరులు తండాకు వెళ్లి చర్చలు జరిపారు. తాము కంకర రాళ్లపై ప్రయాణం చేస్తున్నామని, తండాలో పక్కా ఇళ్లు నిర్మించి, సీసీ రోడ్లు వేయడంతోపాటు విద్యుత్ దీపాలు అమర్చాలని తండావాసులు కోరారు. అటవీ శాఖ నుంచి అడ్డంకులు తొలగించి వసతులు కల్పించాలన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు హామీ ఇవ్వడంతోపాటు అధికారులు నచ్చజెప్పడంతో మధ్యాహ్నం రెండు గంటల తరువాత తండావాసులు ఓట్లు వేశారు.



పోలింగ్ కేంద్రంలో ఖాళీగా కూర్చున్న సిబ్బంది

మొరాయించిన ఈవీఎంలు

వర్ని/బోధన్‌టౌన్/డిచ్‌పల్లి/ఇందల్వాయి/నిజామాబాద్‌అర్బన్/బోధన్ రూరల్: జిల్లాలోని పలు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ కొద్దిసేపు నిలిచిపోయింది. ఈవీఎంలు మొరాయించిన సమయంలో క్యూ లైన్లు పెరిగిపోవడంతో పలుచోట్ల ఓటర్ల మధ్య తోపులాట జరిగింది. ఓటర్లు అసహనానికి లోనయ్యారు.

- వర్ని మండలం తగిలేపల్లిలోని 103వ పోలింగ్‌బూత్‌లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే ఈవీఎం మొరాయించింది. అధికారులు, టెక్నీషియన్లు గంటపాటు శ్రమించి సరిచేయడంతో 8గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గంటపాటు ఈవీఎం మొరాయించడంతో పెద్ద సంఖ్యలో గుమిగూడిన ఓటర్ల మధ్య తోపులాట ప్రారంభమై ఘర్షణ వాతావరణం నెలకొంది.
- బోధన్ పట్టణంలోని హనుమాన్ టేక్డి 91వ పోలింగ్ బూత్‌లో 20నిమిషాలపాటు ఓటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది.
- డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని 109వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం 35 నిమిషాలపాటు మొరాయించింది. 7.36 గంటలకు పోలింగ్ ప్రారంభించారు.
- ధర్మారం(బి) గ్రామంలోని 93వ నంబర్ పోలింగ్‌బూత్‌లో 84 ఓట్లు పోలైన తరువాత ఈవీఎం సుమారు గంటకుపైగా మొరాయించింది. సిబ్బంది సరిచేయడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో కొత్త ఈవీఎంను ఏర్పాటు చేసి తిరిగి పోలింగ్ కొనసాగించారు. గంటకు పైగా వేచి ఉండాల్సి రావడంతో క్యూలైన్ భారీగా పెరిగింది. దీంతో ఓటర్లు పోలింగ్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



వర్ని మండలం తగిలేపల్లిలో ఓటర్ల తోపులాట

- సిరికొండ మండలం చిన్నవాల్గోట్ లో గంటపాటు, మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో అరగంటపాటు, ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లిలో రెండుగంటలపాటు ఈవీఎంలు మొరాయించాయి.
- జిల్లా కేంద్రంలోని 81, 171, 271, 272 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి.
- బోధన్ మండలంలోని కొప్పర్గలో ఈవీఎం మొరాయించడంతో ఎన్నికల అధికారులు పోలింగ్ సమయాన్ని పొడిగించారు. పోలింగ్‌బూత్ నంబర్ 4లో సాయంత్రం 5గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. మరో ఈవీఎంను ఏర్పాటు చేయగా రాత్రి 8.30గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

రూ.5.42 లక్షల నగదు పట్టివేత

బోధన్‌టౌన్(బోధన్): ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.5.42లక్షల నగదును బోధన్ పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో ఓ జాతీయ పార్టీకి చెందిన నాయకుడు డబ్బులు పంపిణీ చేస్తున్నాడనే సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నగదును తరలిస్తున్న నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓటేసిన శతాధిక వృద్ధులు

నిజామాబాద్‌నాగారం/పెర్కిట్(ఆర్మూర్): జిల్లాలోని పలుపోలింగ్ బూత్‌లకు శతాధిక వృద్ధులు వచ్చిన తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజామాబాద్ నగరంలోని నలంద హైస్కూల్ పోలింగ్ బూత్‌లో నాందేవ్‌వాడకు చెందిన గోపిశెట్టి వెంకమ్మ(101) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు తాను 15 మంది ప్రధాన మంత్రుల పాలనను చూశానని వెంకమ్మ తెలిపారు. అలాగే ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన మారెమ్మ(102) కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్‌కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. 'ఓట్ ఫ్రం హోమ్' అవకాశం ఉన్నప్పటికీ నలుగురికి ఆదర్శంగా నిలవాలనే భావనతో పోలింగ్ కేంద్రాలకు పలువురు వృద్ధులు తరలివచ్చారు.



ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మారెమ్మ

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధర్నా

నందిపేట్(ఆర్మూర్): ఎన్నికల విధుల్లో పాల్గొన్న వరంగల్ జిల్లాకు చెందిన ఎస్సై నరేశ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలపై చేయి చేసుకున్నాడని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వెల్మల్ ప్రభుత్వ పాఠశాల ఎదుట పార్టీ కార్యకర్తలతో కలిసి ధర్నా చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎస్సై మద్దతు తెలుపుతూ వారిని పోలింగ్ కేంద్రాలకు పంపుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరించడంతోపాటు చేయి చేసుకున్నారని ఆరోపించారు.



వెల్మల్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

తెగిన ఓటరు బొటన వేలు

నవీపేట : మండలంలోని అబ్బాపూర్(బి) తండా పోలింగ్‌బూత్‌లో అపశృతి చోటు చేసుకుంది. పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు ఒక్కసారిగా ఒకరినొకరు తోసుకున్నారు. వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ ఒక్కసారిగా గేటు వేయగా, అక్కడే ఉన్న ఓటరు రాజన్న కుడిచేయి బొటనవేలు అందులో ఇరుక్కుని రక్తస్రావమైంది. అతడు నవీపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా తెగిన బొటనవేలి భాగాన్ని తొలగించి చికిత్స చేశారు.

అవే తప్పులు.. తప్పని తిప్పలు

- ఓటు హక్కు ఓ చోట.. పోలింగ్ బూత్ మరోచోట
- లోపాలను సరిదిద్దడంలో అలసత్వం
- ఇబ్బందులు ఎదుర్కొన్న ఓటర్లు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన ప్రభవకుమార్‌కు స్థానిక చిరునామాపై ఓటరు గుర్తింపు కార్డు జారీ చేసిన ఎన్నికల అధికారులు.. అతని ఓటు మాత్రం దొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్‌లో కేటాయించారు. ప్రభవకుమార్ కుటుంబం మోర్తాడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకోగా.. అతను ఒక్కడు మాత్రమే దొన్కల్‌కు వెళ్లి ఓటు వేయాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తప్పుదొర్లగా.. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పునరావృతం కావడం గమనార్హం. అలాగే మెండోరా మండలం దూద్‌గాంకు చెందిన వడ్నాల రవళి గ్రామంలో కాకుండా మెండోరా మండల కేంద్రంలో ఓటు వేయాల్సి వచ్చింది. మెండోరాకు చెందిన రాజమణికి ఇక్కడ కాకుండా దూద్‌గాం ఓటరు జాబితాలో పేరు ఉండటంతో ఓటు హక్కును దూద్‌గాం వెళ్లి వినియోగించుకుంది. ఈ పరిస్థితి ముగ్గురికే పరిమితం కాలేదు.. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అనేక మంది ఓటర్లకు ఎదురైన దుస్థితి. ఓటరు జాబితా సవరణలో బూత్ లెవల్ అధికారి(బీఎల్‌వో)ల అలసత్వం ఓటర్లకు శాపంగా మారింది. వేరే ఊళ్లకు వెళ్లి ఓటు వేయాల్సి రావడంతో చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలని ఓటర్లు కోరుతున్నారు.



ప్రభవకుమార్‌కు జారీ చేసిన గుర్తింపు కార్డులు

పేరు తొలగించారు



నేను గతంలో ఓటు హక్కు వినియోగించుకున్నాను. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని ఆశతో ఉంటే.. జాబితాలో పేరు లేదు. జాబితా నుంచి నా పేరు ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదు. అధికారులను ఈ విషయమై ప్రశ్నిస్తే వారి నుంచి సరైన స్పందన లేదు. ఓటు వేయకపోవడంతో చాలా నిరాశ చెందాను.

– జి. స్రవంతి, వడ్యాట్

పోలింగ్ అధికారిణికి ఫిట్స్



సునీతను ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి 119వ పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తిస్తున్న అదనపు పోలింగ్ అధికారిణి (ఓపీవో) సునీతకు ఫిట్స్ వచ్చింది. ఉదయం అల్పాహారం చేసి బాగానే విధుల్లో పాల్గొన్న ఆమె మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఫిట్స్ వచ్చి పడిపోయారు. వెంటనే అక్కడున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

గుండెపోటుతో మృతి

ధర్పల్లి: డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఎన్నికల విధుల్లో ఉన్న సాదిక్ (34) గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని హొన్నాజీపేట్‌కు చెందిన సాదిక్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రమైన సీఎంసీలో విధులు నిర్వర్తించాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో కుప్పకూలిపోవడంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించగా ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యోగులు కోరారు.



సాదిక్ (ఫైల్)

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారు

సిరికొండ: అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని రావుట్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు సానుకూల వాతావరణం ఉందన్నారు. ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయని అర్వింద్.. ప్రధాని మోదీ పేరు చెప్పి ఓట్లు అడిగారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యమన్నారు.



భీమ్‌గల్‌లో వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న సీఐ శ్రీనివాస్





డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఈవీఎంలను అప్పగిస్తున్న పోలింగ్ సిబ్బంది



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓటు వేసిన వృద్ధులు

కాలి వేలితో ఓటు వినియోగించుకున్న దివ్యాంగుడు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సుద్దపల్లి తండాకు చెందిన అజ్మీరా రవికి రెండు చేతులు లేవు. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రవి తన ఓటు హక్కును కాలి వేలితో వినియోగించుకున్నాడు. పోలింగ్ సిబ్బంది రవి కాలి వేలిపై సిరా గుర్తు వేశారు.

క్రైం కార్నర్

భూమి సర్వే అడ్డుకుంటున్నారని ఆత్మహత్య

డిచ్‌పల్లి: తాను అమ్మగా మిగిలిన భూమిని తనకు అప్పగించడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బాలపురం గంగారెడ్డి (53) తన పేరిట ఉన్న భూమిని 12 సంవత్సరాల క్రితం విక్రయించాడు. తాను అమ్మగా మిగిలిన ఎకరం 2 గుంటల భూమి గంగారెడ్డి పేరుపై ఉంది. బతుకుదెరువు కోసం గంగారెడ్డి కొంత కా లంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సర్వే చేయించి ఎకరం రెండు గుంటల భూమిని తనకు అప్పగించాలని మూడేళ్లుగా తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తున్నాడు. అయితే, సర్వే చేయకుండా భూమి కొనుగోలు చేసిన వారు అడ్డుకుంటున్నారని మనస్తాపానికి గురయ్యేవాడు. మనవడి బారసాల కోసం రెండు రోజులక్రితం హైదరాబాద్ నుంచి మెంట్రాజ్‌పల్లికి వచ్చిన గంగారెడ్డి.. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తాను అమ్మిన భూమిలోని మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ మృతుడి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి వృద్ధురాలు..

ఆర్మూర్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు పట్టణంలోని మల్లారెడ్డి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగంటి కళావతి(75) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయి చెరువులో దూకింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం.. యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉద్యోగం ఇప్పిస్తామని రూ.8లక్షలు తీసుకొని మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలకేంద్రానికి చెందిన కుమ్మరి ప్రవీణ్ (28)కు 2019లో తాడ్వాయి మండలం చిట్యాలకు చెందిన ఆరిఫ్‌తో పరిచయమైంది. ఈ క్రమంలో మెదక్ ము న్సిపల్ కార్యాలయంలో గ్రూప్–4 స్థాయి ఉద్యోగం (జూనియర్ అసిస్టెంట్) కోసం ఆరిఫ్ తనకు తెలిసిన నిజామాబాద్‌కు చెందిన రామక్రిష్ణారెడ్డి అలియాస్ ఆర్‌కే రెడ్డి వద్దకు కుమ్మరి ప్రవీణ్‌ను తీసుకెళ్లాడు. ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తామని నమ్మించడంతో ఆరిఫ్‌కు రూ.2లక్షలు, రామక్రిష్ణారెడ్డికి రూ.6 లక్షలు ఇచ్చేందుకు ప్రవీణ్ ఒప్పుకున్నాడు. ముందుగా ఆరీఫ్ రూ.2లక్షలు, రామక్రిష్ణారెడ్డి రూ. 5లక్షలు తీసుకున్నారు. నాలుగేళ్లు దాటిపోవడంతో ప్రవీణ్ ఇద్దరిని గట్టిగా అడిగాడు. దీంతో మరో లక్ష రూపాయలు తీసుకువస్తే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తామని చెప్పడంతో ప్రవీణ్ మరో రూ.లక్ష సిద్ధం చేసుకొని వెళ్లాడు. డబ్బులు తీసుకున్న ఇరువు.. మెదక్ మున్సిపాలిటీలో ఉద్యోగం వచ్చింది అని చెప్పి ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్‌ను ప్రవీణ్ చేతిలో పెట్టారు. మెదక్‌కు వెళ్లిన ప్రవీణ్ ఉద్యోగం విషయంలో అధికారులను ఎంక్వైరీ చేయగా ఫేక్ అని తేలింది. మరో వైపు ప్రవీణ్‌కు అప్పు ఇచ్చిన వారు డబ్బుల కోసం ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం వైఎస్ జగన్, భారతమ్మ




పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురంలోని పోలింగ్ కేంద్రంలో తన సతీమణి వైఎస్ భారతి రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఓటు వేశారు. పులివెందులలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి కూడా ఓటు వేశారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇడుపులపాయలోని మల్లేలమ్మ తల్లి నగర్‌లో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, అనికుమార్ ఓటు వేశారు.

ఓటేసి వచ్చేశారు..



చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ ఏర్పడింది. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో వాహనాలు బారులుదీరి వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంట్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్నవారు ఓటు వేసేందుకు సొంతూర్లకు వెళ్లి తిరుగు పయనమవుతున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ మొదలైంది.

పచ్చ ముఠాల విధ్వంసకాండ

ఓటమి భయంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఓటమి భయంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఫ్యాక్షన్, రౌడీ మూకలతో కలిసి బీభత్సం సృష్టించారు. కర్రలతో దండెత్తారు. కత్తులతో విరుచుకుపడ్డారు. ఏకంగా బాంబు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య ఓటర్లపై యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు బరితెగించి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఇళ్లు, వాహనాలపై దాడులకు తెగబడి విధ్వంస కాండతో చెలరేగిపోయారు. సామాన్య ప్రజానీకాన్ని హడలెత్తించారు. పల్నాడు, అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం.. ఇలా దాదాపు అన్ని జిల్లాల్లోనూ విధ్వంసానికి దిగారు. ఈ గొడవలన్నింటికీ కర్త, కర్మ, క్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ, జనసేన పార్టీలు దాదాపు 15 రోజులుగా రాష్ట్రంలో కుట్రలకు తెరతీసిన విషయం తెలిసిందే. ఓటర్లను యథేచ్ఛగా ప్రలోభాలకు గురి చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కవ్విస్తూ దాడులకు పాల్పడుతూ వచ్చాయి. ఆ విధ్వంసకర కుట్రను పోలింగ్ సందర్భంగా సోమవారం పతాక స్థాయికి తీసుకువెళ్లాయి. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే పోలింగ్ సరళి టీడీపీకి వ్యతిరేకంగా ఉందనే విషయం స్పష్టం కావడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ బెంబేలెత్తిపోయారు. దాంతో ముందస్తు పన్నాగంతో సిద్ధం చేసిన తమ రౌడీమూకలకు పచ్చ జెండా ఊపారు. ఆ వెంటనే టీడీపీ, జనసేన రౌడీలు యథేచ్ఛగా దాడులకు తెగబడి రాష్ట్ర వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. ఉదయం మొదలైన ఈ దాడులు, దౌర్జన్య కాండ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేలా చూడాల్సిన ఎన్నికల కమిషన్(ఈసీ).. వైఎస్సార్‌సీపీ ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ టీడీపీ, జనసేన గుండాల దాడులపట్ల ఉదాసీనంగా ఉండటం విస్మయ పరుస్తోంది.

హడలెత్తిన టీడీపీ, జనసేన

ప్రతిష్టాత్మకమైన ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళి ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ మొదటి నుంచీ వ్యక్తమైంది. సోమవారం ఉదయం పోలింగ్ మొదలు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వారిలో మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉండటం విశేషం. ఆ వర్గాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్నారని జాతీయ చానళ్లతోపాటు అన్ని సర్వేలు వెల్లడించాయి. అంటే ఓటింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందన్నది స్పష్టమైంది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు.. ఓటింగ్ ప్రక్రియను దెబ్బతీసే కుట్రకు తెరతీశారు. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా లేకపోతే విధ్వంసం సృష్టించేందుకు ముందుగానే ఆ రెండు పార్టీలు పన్నాగం పన్నాయి. అందుకోసం టీడీపీలోని రౌడీ షీటర్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను ముందుగానే రప్పించాయి. కర్రలు, కత్తులతోపాటు పెట్రోల్ బాంబులు కూడా ముందుగానే సమకూర్చుకోవడం టీడీపీ, జనసేన కుట్రకు నిదర్శనం. చంద్రబాబు ఆదేశించగానే.. టీడీపీ, జనసేన రౌడీలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడ్డారు.

చోద్యం చూసిన ఈసీ

టీడీపీ, జనసేన గూండాలు బరితెగించి విధ్వంసానికి పాల్పడి పోలింగ్‌కు ఆటంకులు సృష్టించినా ఎన్నికల కమిషన్(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నివ్వెర పరుస్తోంది. వారం రోజుల ముందు నుంచే టీడీపీ ఎన్నికల ప్రలోభాలపై వైఎస్సార్‌సీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా వ్యూ యాప్ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండటంపై పూర్తి ఆధారాలను కూడా సమర్పించింది. టీడీపీ గూండాలు దాడులకు పాల్పడిన ఉదంతాలను.. పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించేందుకు పదును పెడుతున్న కుట్రలను కూడా ఈసీ దృష్టికి తీసుకువెళ్లింది. అయినా సరే పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఈసీ పూర్తిగా విఫలమైంది. అసలు టీడీపీ, జనసేన గూండాలు వీధుల్లోకి వచ్చి చెలరేగిపోతున్నా, పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నా.. ఈవీఎంలను ధ్వంసం చేసినా.. ఏకంగా బాంబు దాడులకు పాల్పడినా సరే ఈసీ మాత్రం క్రియాశీలంగా స్పందించనే లేదు. పైగా వైఎస్సార్‌సీపీ నేతలనే కట్టడి చేసేందుకు యత్నించడం విభ్రాంతి కలిగిస్తోంది.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ముందు ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ గూండాలు



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లంలో టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు

గుంటూరు జిల్లా తెనాలిలో పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నబత్తున శివకుమార్‌ను టీడీపీ కార్యకర్త గొట్టిముక్కల సుధాకర్ పరుష పదజాలంతో దూషించారు. మాల, మాదిగలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ నోరు పారేసుకున్నారు.

దీనిపై ఎమ్మెల్యే అన్నాబత్తున శివ కుమార్ అభ్యంతరం చెప్పినా వినిపించుకోకుండా మరింతగా దూషించడంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించి వేశారు. ఈసీ మాత్రం ఎమ్మెల్యే అన్నా బత్తున శివ కుమార్‌ను పోలింగ్ ముగిసే వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసులను ఏకపక్షంగా ఆదేశించడం విస్మయ పరిచింది. ఆయన్ను దూషించిన టీడీపీ కార్యకర్తపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసంపై టీడీపీ రౌడీలు దాడికి పాల్పడి, అక్కడ ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. కానీ ఈసీ మాత్రం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచమని పోలీసులను ఆదేశించడం విడ్డూరంగా ఉంది.

కత్తిపోటు నుంచి బాంబు దాడుల వరకూ..

పోలింగ్ మొదలైన కాసేపటికే టీడీపీ రౌడీలు చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం పోలింగ్ శాతం పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన దాడుల తీవ్రతను అమాంతం పెంచుకుంటూ పోయాయి.

బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నప్పటికీ ఆమంచి శ్రీనివాస్.. టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య యాదవ్‌కు అనుకూలంగా పని చేశారు. పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆయన తీవ్ర అసహనానికి గురైన ఆయన రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నేత అంకమ్మగారుపై దాడి చేసి చెంపపై దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య యాదవ్ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు.

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, ఆయన వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో సుధీర్‌రెడ్డికి గాయమైంది. ఎర్రగుంట్ల 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షాహీద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు.

వీరపునాయునిపల్లె మండలంలోని యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. కడపలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ముస్లింలపై టీడీపీ గూండాలు రాళ్ల దాడికి తెగబడ్డాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకుని ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడటంతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజంట్లపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైమరీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

మచ్చుకత్తితో దాడి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో స్లిప్పుల పంపిణీ కోసం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శిబిరం వద్దకు ఓటర్లు వెళ్లడంతో ఓర్చుకోలేని టీడీపీ కార్యకర్త ఇడగొట్టు రంగప్ప మచ్చుకత్తితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంద్రప్పను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై పేగులు బయటకు వచ్చాయి. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఓటర్లు చెల్లాచెదురయ్యారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించి తిరిగి వెళ్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఘటనలో పురుషోత్తం రెడ్డి ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఒప్పిచర్లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌లపై హత్యాయత్నం

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రాణ భయంతో వారు తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. దాదాపు 300 మంది టీడీపీ గూండాలు వెంట పడటంతో కారెంపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం పొట్టి శ్రీరాములు కాలనీలోని ఎన్నికల బూత్‌ల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగి రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. కారెంపూడిలోని 288 నెంబర్ బూత్‌లో ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న గోగుల సాంబశివరావు తమ్ముడిపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడటంతో దాడిని అడ్డుకునే యత్నంలో సాంబశివరావు తలకు గాయమైంది. వైఎస్సార్ జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నూలి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం రాళ్ల దాడి చేశారు. కాగా, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో జిల్లా సునంద అనే మహిళకు చేయి విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

పూతలపట్టులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై పచ్చ మూక దాడులకు పాల్పడింది. పేటగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అనంతరం పేటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుస్వామినాయుడుపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో గురుస్వామి నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వావిల్‌తోట పంచాయతీ సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా వున్న హరిబాబుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే జిల్లా సోమల మండలం కందూరు పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు దాడికి పాల్పడ్డాడు. పోలింగ్ కేంద్రంలో వద్ద ఏర్పడిన వివాదంతో సుబ్రమణ్యం నాయుడు తన అనుచరులతో కలసి దాడి చేశాడు. గంగాధర్ నెల్లూరు మండలం జంగాలపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు గ్రామస్తులపై దౌర్జన్యం చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్ళ కండ్రిగలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. కారును ధ్వంసం చేసి ఓ నాయకుడిని తీవ్రంగా గాయపరిచారు. తొలుత టీడీపీ నాయకులు ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుకు అడ్డంగా పందిరి వేశారు. దీనిని పోలీసులు తీసి వేయడంతో జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. ఇనుప రాడ్లు, కొయ్యలతో పలువురిని తీవ్రంగా గాయపరిచారు.

పసుపు కండువాతో 'గంటా' హల్‌చల్

భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్ చేశారు. తన అనుచరులతో కలిసి పోలింగ్ స్టేషన్‌లోకి వెళుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లడంతో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన మల్లాడి చిన ధర్మారావు, మల్లాడి నర్సింహులు, అరదాని శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారు. రామకృష్ణారావుపేటలో కొందరు టీడీపీ సానుభూతిపరులు చేసిన దాడిలో మాజీ కార్పొరేటర్ రోకళ్ళ సత్యనారాయణతో పాటు మరికొందరు గాయపడ్డారు. రూరల్ కరప మండలం పెదకొత్తూరులో పోలింగ్ బూత్ వద్ద జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి చెందిన చింతా సత్యనారాయణపై దాడి చేసి మొబైల్ ఫోన్ లాక్కొని వివాదం సృష్టించారు. పిఠాపురం నియోజకవర్గం విరవ, విరవాడ ప్రాంతాల్లో కూడా జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు.

'చింతమనేని' వర్గీయులు కత్తెరతో దాడి

పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చలపాటి రవిపై చింతమనేని అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన రవి భుజంపై కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడిన రవి ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నాడు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆసుపత్రికి చేరుకుని రవిని పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూలులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా వచ్చారు. అప్పుడే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలపై లాఠీఛార్జి చేశారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాల బూత్‌లో డీఎస్పీ మల్లికార్జునరావు వైఎస్సార్ సీపీకి చెందిన బూత్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారు. వారి గుర్తింపు కార్డులను లాక్కొని బయటకు వెళ్లాలంటూ ఆదేశించారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు.



ఓటేసిన చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

ఫ్యాన్ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ కొనసాగింది. రాత్రి 10 గంటల సమయానికి 76.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎండల ప్రభావం తగ్గడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి దోహదం చేసింది.

నిర్దేశించేది మహిళలు, గ్రామీణ ఓటర్లే..

పోలింగ్ సరళిపై ఇండియాటుడే ఛానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సోమవారం రాత్రి టీవీలో చర్చ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను విస్తారంగా పర్యటించానని.. మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. ఈ చర్చలో పాల్గొన్న సెఫాలజిస్ట్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించే యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా దీనిపై ఏకీభవించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల ఫలితాలను మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. రోడ్లు గురించి కాకుండా ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయన్నదే ప్రామాణికంగా తీసుకుని 80 శాతం మంది మహిళలు ఓటు వేస్తారని తెలిపారు.

ఇంటింటి అభివృద్ధిని ప్రతిబింబించిన పోలింగ్ సరళి..

నవరత్నాల పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు, సుపరిపాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఓట్లు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలను పెత్తందారులు – పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా బడుగు, బలహీన వర్గాలు భావించడం వల్లే భారీగా పోలింగ్ నమోదైందని పేర్కొంటున్నారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయండి

ఓటేసిన ప్రముఖులు

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యూలో నిల్చుని ఓటును వేసి ఆదర్శంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ ఓటు ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు సూచించారు. మన తలరాతను మార్చేది ఓటేనన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దంపతులు



కుటుంబసభ్యులతో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ దంపతులు



బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే రేకుల భూపతిరెడ్డి కుటుంబ సభ్యులు



మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కుటుంబసభ్యులు



కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి కుటుంబసభ్యులు



నగర మేయర్ నీతూకిరణ్



రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి